కథానిక-వెల్చేరు చంద్రశేఖర్

# దహాతి

బంధాలు, అనుబంధాలు సవ్యంగా సాగుతున్నంతకాలం అవే మనిషికి జవజీవాలు. అవి అపసవ్యంగా మారిన మరుక్షణం నుంచి అవే మృత్యుముఖాలు. ఈ కథ అంతరార్థం అదే.

తిరుపతి రెడ్డి అరుగు మీదున్న నులకమంచం తీసుకొచ్చి ఆరుబయట వాకిటిలో వేసుకు కూర్చున్నాడు. జేబులోంచి చుట్ట తీసి దాని వెనుక భాగాన చిన్న కొరుకు కొరికి ఉమ్మేశాడు. చుట్టని నోట్లో పెట్టుకొని జేబులు తడుముకున్నాడు. జేబులో అగ్గిపెట్టె లేదు. 'మునిల్డి ఏ పొయ్యి అంటించడానికో తీసి, ఎక్కడో గూట్లో పెట్టేసింది' అనుకున్నాడు. లేచి వెళ్ళి అగ్గిపెట్టె వెతుక్కు తెచ్చుకునే ఓపిక లేక అక్కడే అలా కూర్చున్నాడు. అలాంటి సమయాల్లో రాజా జ్ఞాపకం వచ్చేడు. రాజా ఉంటే "నే తెస్తా నాన్నా" అని వెళ్ళి తీసుకొచ్చేవాడు.

రాజా జ్ఞాపకం రాగానే వీధి గుమ్మం వేపు చూశాడు తిరుపతి రెడ్డి. పదేళ్ళ నుంచి ఆ గుమ్మం వేపు అలా చూస్తూనే ఉన్నాడు.

రాజా ఉరఫ్ రాజశేఖర్ రెడ్డి ఆ గుమ్మంలోంచి పదేళ్ళ క్రితం బైటకి వెళ్ళాడు. అదీ తండ్రి మీద కోపంతో. కోపం తగ్గాక వాడే వస్తాడన్నారు చాలా మంది. కానీ, రాజా తిరిగి రాలేదు. వస్తాడు, వస్తాడు అనుకుంటుండగానే పదేళ్ళు గడిచాయి. మొదట్లో తిరుపతి రెడ్డికీ నమ్మకం ఉండేది రాజా వస్తాడని, ఏర్పడ్డ వైమనస్యం తొలగిపోతుందని. కానీ, రోజులు గడిచేకొద్దీ ఏవేవో అస్పష్టమైన వార్తలు వినిపించ సాగాయి. ఆ వార్తల్లో నిజం ఎంతో, అబద్ధం ఎంతో, దానికి తనెంతవరకూ బాధ్యుడో అని ఆలోచించి ఆలోచించి అంతు తెలీని మానసికక్షోభకి గురయ్యాడు.

తిరుపతి రెడ్డికి పదేళ్ళక్రితం అరవై ఏళ్ళు, అతను ఊరికి పెద్ద. కర్ర పట్టుకుని, కిర్రు చెప్పులేసుకుని నడిస్తే, దారినపోయే ఊరి జనం గౌరవంగా పక్కకి తప్పుకునేవారు. ఆ ఊర్లో అతను మోతుబరి రైతు. ఊరిని శాసించగల డిగ్రీ చదువుతున్నాడు. కానీ, ఇప్పుడదంతా గతం.


పదేళ్ళలో ఎంత మార్పు జరిగింది. ఈ పదేళ్ళతో రెడ్డికి డెబ్బై ఏళ్ళు నిండాయి. కానీ, ఇప్పుడు తిరుపతి రెడ్డి తొంభైయేళ్ళవాడిలాగ కనిపిస్తాడు. చూపులో గాంభీర్యం పోయింది. పలకరించిన వాళ్ళకి హుందాగా సమాధానం చెప్పే రెడ్డిని ఇప్పుడు ఎవరూ పలకరించరు. అతని నడకలో నెమ్మది, ఠీవి పోయాయి. వాటి స్థానంలో చిన్న తొందర, అస్తవ్యస్తమైన నడక చోటు చేసుకున్నాయి. కనిపించిన వాళ్ళని గాంభీర్యంగా కుశలమడిగే తిరుపతి రెడ్డి, ఇప్పుడు ఎవర్నీ పలకరించడం మానేశాడు. గ్రామంవాళ్ళు కూడా అతన్ని గుర్తించడం మానేశారు. అన్నిటినీ మించి పదేళ్ళలో రాజా కోసం ఎదురు చూసి ఎదురు చూసి, చూపులు వెదికే చూపులుగా మారిపోయాయి. ఆ వెదకులాటలో కూడా తీవ్ర ప్రకృతిని సంతరించుకుని, అతని చూపులు పిచ్చి చూపులైపోయాయి. అతను ఎవరి రాక కోసమో ఎదురు చూస్తున్నట్లు ఊరి పొలిమేరల్లో, బస్టాండ్‌లో, రైల్వే స్టేషన్‌లో పర ధ్యానంగా తిరగడం, వచ్చిన ప్రయాణికుల్ని పిచ్చిగా పరిశీలించడం చూసి కొందరు అనుమానంగా చూశారు. ఆ తర్వాత అతన్ని పట్టించుకోవడం మానేశారు.

రెడ్డి కనిపించినా, అతని గురించి ఎవరేనా విషయం ప్రస్తావించినా ఊరిలో జనం బాధపడడం మినహా ఇంకేం చేయలేకపోతున్నారు. రెడ్డిని ఇంట్లోనే ఉండేటట్లు చేద్దామనుకున్న ఊరి పెద్దల ప్రయత్నం ప్రయత్నంగానే ఉండిపోయింది. రెడ్డి ఎవరికీ ఎదురు చెప్పడం కాని, విపరీతంగా ప్రవర్తించడం కాని చేసేవాడు కాదు. పది రోజులు రెడ్డిని ఇంట్లో కట్టడి చేస్తే, ఇంట్లో బుద్ధిగా కూర్చునే వాడు. కానీ, అందరూ 'ఇంక ఫర్వాలేదు' అనుకునే సమయానికి ఇంట్లోంచి మాయం అయిపోయేవాడు.

ఆరకంగా ఒక రోజు ఆయన పక్కనున్న ఊళ్ళోకి వెళ్ళాడు. తిన్నగా చెప్పుల దుకాణంలోకి వెళ్ళాడు. అక్కడ షోకేసులో పెట్టిన చెప్పు తీశాడు. షాపు యజమాని వచ్చేలోగా ఆ చెప్పుతో నెత్తిమీద గబగబా కొట్టుకున్నాడు. "అరె రెడ్డిగారు, ఏమిటిది" అని పట్టుకున్న కొట్టు యజమానిని చూసి "ఏం, ఆడవాళ్ళ చెప్పుతో గాని కొట్టుకోకూడదా" అని ఆడవాళ్ళ చెప్పు తీసి కొట్టుకున్నాడు. షాపు యజమాని చెప్పు లాక్కుని "అరెరె, తప్పండీ రెడ్డిగారూ" అన్నాడు.

"ఏం నువ్వే కొడతావా? కులానికి మాదిగ వాడివైనా, చెప్పులు కుట్టడమేకాదు, చెప్పుతో కొట్టే హక్కు కూడా సంపాదించావు. కొట్టవోయ్ కొట్టు. లేకపోతే రాజాని కాదంటావా? నీ కూతుర్ని తిరస్కరిస్తావా? కులం మదంగాణ్ణి! తప్పులేదు కొట్టు" అంటూ షాపు యజమాని ముందు చతికిలబడ్డాడు. ఆ షాపు యజమాని కళ్ళనుంచి రెండు కన్నీటి బొట్లు రాలినై! ఆ రోజు అతను పట్నంలో ఉన్న కూతురికి షాపులో జరిగింది రాశాడు.

"నాన్నా ఇదంతా రెడ్డిగారి భ్రమ. దానికి కారణం రాజా తండ్రితో నా విషయం తీసుకొచ్చి ఘర్షణ పడడం! ఇల్లు వదిలి వెళ్ళిపోవడం! రాజాకున్న ఆదర్శాలూ, స్వప్నాలూ వేరు. అందులో నేను ఒక పాత్రని మాత్రమే. ఇద్దరి అభిప్రాయాలూ కలియడం వల్లనే అతనికీ, నాకూ మధ్య పరస్పర



అనురాగం ఏర్పడింది. ఇద్దరం కలిసి ఏదేనా ఆదివాసీ గ్రామంలోకి వెళ్ళి అక్కడే నివసిస్తూ, ఆ గ్రామాన్ని, ప్రజల జీవితాన్ని అభివృద్ధి చేద్దాం అనుకున్నాం. మా ఇద్దరి పెళ్ళికి రెడ్డిగారు అనుమతించలేదు అంటే రాజా కోపం తెచ్చుకున్న మాట నిజం. కానీ, విరక్తి, కసి అన్నవి రాజా జీవితంలో లేవు! ఇంక రాజా తీవ్రవాది అయ్యాడా లేదా అన్నది చిక్కు వీడని ప్రశ్న. అన్నీ తెలిసీ తెలిని వార్తలే. రెడ్డిగారి పరిస్థితికి జాలిపడటం మినహా మనం చేయగలిగిందేముంది? రాజా ఏమిటో నీకూ తెలును..." అంటూ ఆమె తండ్రికి తిరుగు ఉత్తరం రాసింది.


* * *

ఒక రోజు భార్య ఆరేసిన ఎర్ర చీర ఎత్తుకు పోయాడు తిరుపతి రెడ్డి. ఆ ఊర్లో ఉన్న పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు. ఆ చీరంతా ఒంటికి చుట్టబెట్టుకుని పోలీసుస్టేషన్‌కు ఎదురుగా నిలబడి "రండిరా రండి! కాల్చండి. లేకపోతే ప్రజల బతుకులు మార్చేస్తా! పేదోళ్ళ రాజ్యం తెచ్చేస్తా. వీలైతే ప్రభుత్వాన్ని పడగొట్టేస్తా! హ హ్హ హ్హ! రండి కాల్చండి!" అంటూ శివతాండవం చేశాడు. మొదట్లో పోలీసులు గాభరాపడ్డా, ఆ తర్వాత అతన్ని పట్టించుకోవడం మానేశారు. అంతేకాదు, అతని భార్య ఎర్ర చీర బయట ఆరేయడం మానేసింది.

రెడ్డిగారి మీద గౌరవంతో ఆ ఊరి పోలీసు ఇన్‌స్పెక్టర్ తన పరిధిలో ఎంక్వైరీ చేశాడు. కానీ, పోలీసుల నుంచి, ఆదివాసీ గ్రామ ప్రజల నుంచి స్పష్టమైన కబురు ఏదీ తెలియలేదు.

* * *

చిత్రాలు: నర్సిం



ఆరోజు సంక్రాంతి. పొద్దున్నే నులక మంచంమీద కూర్చున్న రెడ్డికి గుమ్మంలో కొమ్మ దాసరి పాట వినిపించింది–

*తెలుగు రైతుల చేల ధాన్యాల రాశి*
*చేతి నిండగ దానధర్మంబులయ్య*
వానికెక్కును నీ దాన గుణంబు అంటూ.

రెడ్డి నులక మంచంమీంచి చటుక్కున లేచాడు. కొమ్మ దాసరి దగ్గరకు వెళ్ళాడు. "బస్తా ధాన్యం ఇస్తాను పట్టుకెళ్తావ్రా" అని అడిగాడు. కొమ్మ దాసరి ఇదేం పట్టించుకోలేదు. "ఏరా, పిడికెడు కోసం దేవురించకు. బస్తా మోసుకెళ్ళగలవా? నేనూ అంతే. బస్తాల కోసం ప్రార్థించాను. బస్తాలతో ఇల్లు నిండింది. కానీ, అసలువాణ్ణి దాచేశాడ్రా దేవుడు. లోపలికెళ్ళి నీక్కావలసింది పట్టుకుపో" అని మళ్ళీ నులక మంచం దగ్గరకెళ్ళి దానిమీద కూర్చున్నాడు.

అతని భార్య కొమ్మ దాసరిని లోపలికి పిలిచింది. "సాయంకాలం బండివేసినప్పుడు, రెడ్డిగారి నోటమ్మట వచ్చినట్టూ బస్తా ధాన్యం పంపిస్తాను. ఇల్లు ఎక్కడో మా పాలేరుకు చెప్పు" అంది.

పూర్వపు రెడ్డి ఏమిటో తెలును కొమ్మ దాసరికి. ఆ ఇల్లేమిటో తెలును. కళ్ళ నీళ్ళతో ఆవిడకి నమస్కరించి, మరి తిరగడానికి మనస్కరించక ఇంటికి వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం కొమ్మ దాసరి ఇంటికి బస్తాడు ధాన్యం చేరాయి.

ఈ విషయం ఊరిలో తెలిసింది. రెడ్డి సంగతి ఊరందరికీ తెలును. ఇదంతా అతని ఉన్మాదంగా, విరక్తిగా ఏవేవో కారణాలు చెప్పుకున్నారు కానీ, తెల్లవారేసరికి తమకో బస్తా ధాన్యం వస్తాయేమో అని, అతని గుమ్మం ముందు ఊరివాళ్ళందరూ కొమ్మ దాసర్ల వేషం వేసి నిలబడలేదు. ఎదుటివారి లోపాలు తమ సోపానాలుగా చేసుకునే పట్నం ప్రజల ప్రకృతి వారికి అలవడలేదు.

* * *

ఒక రోజు రెడ్డి ఊరికి పదిమైళ్ళ దూరంలో ఉన్న స్టేషన్‌కి వెళ్ళాడు. స్టేషన్‌లో రైలాగి ఉంది. స్టేషన్‌లో గంట కొట్టారు. స్టేషన్ మాస్టర్ రెండు జండాలూ పట్టుకువచ్చి, సిగ్నల్ కోసం తొంగి చూశాడు. సిగ్నల్ ఇచ్చేశారు.

రెడ్డి తిన్నగా స్టేషన్ మాస్టర్ దగ్గరికి వెళ్ళాడు. చేతిలో రెండు జండాలూ లాక్కుని దూరంగా విసిరి పారేశాడు. "ఒరేయ్, జండాలు చూపించి రైలాపడం కాదురా. నీకు దమ్ముంటే చేత్తో రైలాపు" అంటూ పరిగెత్తి ఇంజను ముందుకెళ్ళి రెండు చేతులతోనూ రైలును పట్టుకున్నాడు. అది చూసిన స్టేషన్ మాస్టరూ, కొందరు పోర్టర్లూ అతని వెనకాలే పరిగెత్తారు. సిగ్నల్ ఇచ్చేశారు. రైలు స్టార్ట్ చేశారేమో అని అనుమానం వచ్చిన ఒక పోర్టరు తన షర్ట్ విప్పి పైకి పెట్టి ఇంజన్ డ్రైవరుకి కనిపించేటట్టు ఊపాడు. ఈలోగా అక్కడికి చేరిన స్టేషన్ మాస్టర్, మిగతావాళ్ళు రెడ్డిని పట్టుకుని బలవంతాన పట్టాల పక్కకి తీసుకొచ్చారు. ఇంతలో ఎవరో రెండు జండాలూ తీసుకొచ్చి స్టేషన్ మాస్టరుకి ఇచ్చారు. ఆయన పచ్చ జండా ఊపి రైలుని పోనిచ్చేశాడు.

రెడ్డి మాత్రం పట్టుకున్నవాళ్ళని విదిలిస్తున్నాడు: "ఆపుతా! జండాతో కాదు, సొంత చేత్తో ఆపుతా! నేను రెడ్డి బిడ్డణ్ణిరా!" అంటూ పెనుగులాడుతున్నాడు.

రైలు వెళ్ళిపోయింది. రెడ్డిని వదిలేసి అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. కానీ, రెడ్డి వెళ్ళిపోలేదు. తిన్నగా స్టేషన్ మాస్టరు గదిలోకి వెళ్ళాడు. "మళ్ళీ రైలు ఎప్పుడు వస్తుంది" అని అడిగాడు.

"ఎందుకండీ" అని శాంతంగా తిరిగి ప్రశ్నించాడు స్టేషను మాస్టరు.

"మళ్ళీ రైలుని చేత్తో ఆపడానికా" అంటూ పకపకా నవ్వాడు కుర్ర క్లర్కు. స్టేషను మాస్టరు మాత్రం నవ్వలేదు.

"కాదు" అని అరిచాడు రెడ్డి.

కుర్ర క్లర్కు నవ్వాపేశాడు.

"రైలుని ఆపలేకపోయాను. రైల్లో వెళ్ళలేకపోయాను. ఇంక రైలు కింద నలిగి చావడమే ఈ జీవితానికి మిగిలింది. ప్చ్... రైలు వెళ్ళిపోయింది" అంటూ సీరియస్‌గా స్టేషన్‌లోకి వెళ్ళిపోయాడు. స్టేషన్ మాస్టరుకి బెంగ పట్టుకుంది. ఇంతకుముందు ఎప్పుడు స్టేషన్‌కి వచ్చినా రెడ్డి కొడుకు కోసం కంపార్టుమెంట్లల్లో వెదకడం, సిమెంటు చప్టా మీద కూర్చుని కొడుకు కోసం పిచ్చిగా ఎదురు చూడడం తప్పించి ఇలాగ ఎప్పుడూ ప్రవర్తించలేదు. వయసు పెరిగినకొద్దీ కొడుకు యొక్క నమస్కారాన్ని తిరస్కరించాననే తపన రెడ్డి మనసులో పెరిగి, అది మెల్లమెల్లగా తీవ్ర ప్రకృతిలోకి మారుతోంది. ఈ స్థితిలో రెడ్డి ఏం చేసినా చెయ్యవచ్చు అనుకుని, పోర్టర్లని పిలిచి రెడ్డిని మంచి మాటలతో స్టేషన్ నుంచి పంపెయ్యమన్నాడు.

**అతను ఎవరి రాకకోసమో ఊరి పొలిమేరల్లో, బస్టాండ్‌లో, రైల్వే స్టేషన్‌లో పరధ్యానంగా తిరగడం, వచ్చిన ప్రయాణికుల్ని పిచ్చిగా పరిశీలించడం చూసి కొందరు అనుమానంగా చూశారు. ఆ తర్వాత అతన్ని పట్టించుకోవడం మానేశారు**

పోర్టర్లు రైలు వచ్చే టైమ్‌కి ఇంటికి వచ్చి చెప్తామని చెప్పి రెడ్డిని వాళ్ళ ఊరికి తీసికెళ్ళి దిగబెట్టేశారు.

* * *

తిరుపతి రెడ్డి చెరువు గట్టు మీద నుంచి నడుస్తున్నాడు. చెరువుగట్టుకి కొంచెం దూరంగా చాకలివాళ్ళు నీళ్ళ చెలమ చేసి బట్టలు ఉతుకుతున్నారు. చెరువు గట్టున దుంగ పాతి, దానికి తాడు కట్టి దానికి చిన్న నావని కట్టారు. చెరువులో పుడుతున్న చిన్న అలలకి నావ ఒడ్డుకి కొట్టుకుంటున్నది. ఆ నావకి దూరంగా ఒక యువకుడు చేపలు పడుతున్నాడు. గాలం చెరువులో వేసి పుస్తకం చదువుకుంటున్నాడు. అతని గాలానికి చేప దొరికినట్టుంది. గాలాన్ని లాగి దానికి చిక్కుకున్న చేపని తప్పించి, ఒడ్డు మీద పడేశాడు. మళ్ళీ కొక్కేనికి చిన్న చేపని తగిలించి గాలాన్ని నదిలోకి విసిరేశాడు.


ఒడ్డున పడ్డ చేప పైకి ఎగిరిపడుతోంది. విలవిలా కొట్టుకుంటోంది. తిరుపతి రెడ్డి వెళ్ళి చటుక్కున చేపని తీసి చెరువులో పారేశాడు. ఆ కుర్రాడు ఆశ్చర్యపోయాడు.

"ఏమండీ, ఏమిటిది" అంటూ లేచాడు ఆదుర్దాగా.

"ఒడ్డున ఉన్న మనము చాలమురా రోజూ కొట్టుకుంటూ చావడానికి. మనకి తోడు చేపలు కూడానా" అంటూ ఆ యువకుడి చేతిలో ఫిషింగ్ రాడ్ లాక్కున్నాడు. ఆ యువకుడు రెడ్డిని ఒక్క తోపు తోశాడు. రెడ్డి కింద పడిపోయాడు.

ఆ యువకుడు ఈ ఊరివాడైనా చిన్నప్పటినుంచీ పట్నంలో చదువుకుంటున్నాడు. రెడ్డి గురించిగానీ, గ్రామంలో విషయాలుగానీ ఏమీ తెలియవు.

కిందపడిపోయిన రెడ్డిని "పిచ్చాడులాగున్నాడు" అనుకొని రెడ్డి చేతిలో ఫిషింగ్ రాడ్ లాక్కున్నాడు బలంగా. రెడ్డి మంకుపట్టు పట్టలేదు. పసిపిల్లాడిలా చూశాడు ఆ యువకుణ్ణి. ఆ యువకుడు రెడ్డిని తోసెయ్యడం, చేతుల్లోంచి ఫిషింగ్ రాడ్ లాక్కోవడం చూసిన ఇద్దరు ముగ్గురు చాకలి వాళ్ళు పరిగెత్తుకు వచ్చారు. కిందపడిపోయిన రెడ్డిని లేపి "మీరు వెళ్ళండి బాబూ" అంటూ రెడ్డిని అక్కడ నుంచి పంపించేశారు.



ఆ కుర్రాడికి ఆశ్చర్యం వేసింది. అంత గౌరవం ఉన్నవాడు అలా ప్రవర్తించాడు ఏమిటి" అని. కానీ, చాకలి వాళ్ళతో "ఆయన నే కష్టపడి పట్టిన చేపని చెరువులోకి విసిరేశాడండి" అన్నాడు.

"బాబూ, ఆయన మనసు చెదిరింది. ఒకానొకప్పుడు ఈ ఊరికి పెద్ద. వయసులో ఉన్న కొడుకు జాడ తెలీకుండా పోయాడు. ఆ కొడుకు పోయిన శోకంతో, మీద పడ్డ వయసుతో ఆయన ఇలా తయారయ్యాడు. వివరాలు మీ నాన్నగారికి తెలుసు బాబూ. వెళ్ళి అడగండి చెప్తారు" అని తమ పనుల్లోకి వెళ్ళిపోయారు చాకలాళ్ళు.

* * *

రెడ్డి గురించి అడిగిన కొడుకుని చూసి "అవున్రా. రెడ్డి ఈ ఊరికి పెద్ద. మోతుబరి. దేనికీ లోటు లేదు. అతనికి ఒక్కడే కొడుకు. అసలు కథంతా రాజా ఎవరినో పెళ్ళి చేసుకుంటా నన్నాడు. కులం కాని అమ్మాయిని చేసుకోవడానికి వీల్లేదన్నాడు రెడ్డి. రాజా కోపగించి, తండ్రితో ఘర్షణ పడి ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. ఊరి పెద్దలు "రాజాయే మారుతాడు, కొన్నాళ్ళకు తిరిగివస్తాడు" అన్నారు. కానీ, రాజా చదువుకు స్వస్తి చెప్పి ఒక ఆదివాసీ గ్రామంలోకి వెళ్ళి అక్కడ నివసించడం మొదలుపెట్టాడన్న కబురు తెలిసింది. రెడ్డి కొన్నాళ్ళు బింకంగా ఉన్నాడు. కానీ, రాజా గురించి చిత్రవిచిత్రమైన కబుర్లు తెలిసేవి. నక్సలైట్లతో సంబంధాలు పెట్టుకున్నాడని, వాళ్ళతో తిరుగుతున్నాడని, ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని వగైరా వగైరా. ఇవన్నీ వార్తలు - నీలివార్తలే. నిజం ఎవరూ చెప్పలేకపోయారు. ఈ వార్తలు భరించలేని రెడ్డి విషయం తెలుసుకు రావడానికి మనుషుల్ని పంపాడు. కానీ, వాళ్ళు కూడా ఏవేవో వార్తలు తెచ్చారు. పోలీసులు మాకేం తెలియదన్నారు. రాజా మాత్రం మరి కనబడలేదు. తిరిగి రాలేదు. ఊరివాళ్ళంతా ఇలా చేస్తే బావుండేది, అలా చేస్తే బావుండేది అనేవారే. కానీ, రాజావి, ఆ అమ్మాయివి ఒకే ఆదర్శాలని, రెడ్డి పెళ్ళికి ఒప్పుకున్నా రాజా, ఆ అమ్మాయి అదే దారిలో ప్రయాణించేవారని చాలామంది అభిప్రాయం. కాకపోతే అప్పుడు పరిస్థితి మారి ఉండేదేమో? లేదా రాజా శవాన్ని కళ్ళతో చూసి ఉంటే, రెడ్డికి ఈ తపన ఉండేది కాదేమో? సానుభూతులు, పరామర్శలూ, వదంతులతో రెడ్డి మనసు విచలితమైపోయింది. తిరిగి రాని సమయాన్ని, తన నిస్సహాయతని తలచుకుని, తలచుకుని రెడ్డి ఇలా తయారయ్యాడు. ఈ మధ్య కొంచెం విపరీతంగా ప్రవర్తిస్తున్నాడని వింటున్నాం. విని బాధపడ్డం మినహా చేసేదే ముంది" అన్నాడు ఆ కుర్రాడి తండ్రి బాధతో.

అప్పుడే "వివిధ్ భారతి"లో లతా మంగేష్కర్ ఘోషిస్తోంది.

"బడా కంజోర్‌హై ఆద్మీ
అభీ లాఖోంహై ఇస్‌మే కమీ..." అంటూ.

"అవును ఎన్నిలక్షల బలహీనతల్ని కలిగున్నాడో కదా ఈ మానవుడు" అనుకొన్నాడు ఆ పట్నం కుర్రాడు.

* * *

తెలతెలవారుతోంది. ఊరిలోనున్న గుడి మైకులోంచి ఘంటసాల "భగవద్గీత" వినిపిస్తోంది. సాంఖ్యయోగం చదువుతున్నాడు.

"నైనం ఛిన్దంతి శస్త్రాణి, నైనం దహతి పావకః" అంటూ.

ఒక రోజు రెడ్డి ఊరికి పదిమైళ్ళ దూరంలో ఉన్న స్టేషన్‌కి వెళ్ళాడు. "ఒరేయ్, జండాలు చూపించి రైలాపడం కాదురా. నీకు దమ్ముంటే చేత్తో రైలాపు" అంటూ ఇంజను ముందుకెళ్ళి రెండు చేతులతోనూ రైలును పట్టుకున్నాడు.

పరమేశ్వరశాస్త్రి నోట్లో పందోంపుల్ల పెట్టుకుని ఇంటి అరుగుమీదకి వచ్చాడు. ఎదురుగా ఆవరణలో తులసికోటను ఆనుకుని కూర్చున్న తిరుపతి రెడ్డి కనిపించాడు. శాస్త్రిని చూడగానే తిరుపతి రెడ్డి లేచాడు.

"శాస్త్రీ ఏమన్నావ్, ఆత్మ కోయబడదు, దహించబడదూ అనా. కాదురా శాస్త్రీ, నా రాజా నన్ను దహిస్తున్నాడు. ఏడీ, ఏ శాస్త్రకారుడూ 'నైనం దహతి పుత్రః' అన్నాడా? ఎవడేనా అంటే చెప్పు!" అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

పరమేశ్వరశాస్త్రికి రెడ్డి చిన్నప్పటి నుంచీ తెలుసు. "ఇద్దరిదీ ఒకే ఊరు. ఇద్దరూ ఆ ఊరికి మూలస్తంభాలలాంటివారు. ఇప్పుడు మూలస్తంభం మూలమే కదిలిపోయింది. పుత్రశోకం మనిషిని విచలితుణ్ణి చేసినట్టుగా మరో శోకం దహించదు. అదీ డెబ్భైఏళ్ళకి. ఎదురుగా రాజా పోయి, అతని చావును ఆ క్షణంలో అనుభవించి ఉంటే రెడ్డి మనసు ఇంతగా తపించకపోను ఏమో! సజీవంగా కోపంతో తనని తిరస్కరించి వెళ్ళిపోయిన కొడుకు రూపం రోజురోజుకీ మనసులో పెరిగి రెడ్డి మనసును దహించేస్తోంది! ఇది చల్లారేది చితిమీదే ఏమో!" అనుకున్నాడు శాస్త్రి నిట్టూరుస్తూ.

దూరంగా పెళ్ళి పందిరిలో మైకు నుంచి

"నెనరెల్ల అనలాన నీరైననాడు
నెమ్మది నాకింక కనరాదు..." అన్న పాట వస్తోంది. ■